సాక్షి తిరుపతి

శనివారం । 3 । ఆగస్టు । 2024



వేడుకగా జెండా పండుగ

స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికారులతో జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సమీక్షించారు. - IIలో



బ్యాంకులో చోరీకి యత్నం

యూనియన్ బ్యాంకులో దుండగుడు చోరీకి యత్నించినట్టు సీసీకెమెరాల్లో రికార్డు కావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. - IIలో



మండుటెండలో మోకాళ్ల దండన

రేణిగుంటలోని ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులను మోకాళ్లపై నిలబెట్టడడంపై డీఈఓ చర్యలు చేపట్టారు. - IIలో

న్యూస్‌రీల్

ట్రాఫిక్ ఎస్‌ఐకు ఎస్పీ నివాళి



ఎస్‌ఐ రెడ్డి నాయక్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైమ్: పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలం పాటు పనిచేస్తూ ఆకస్మికంగా మృతి చెందిన ఎస్‌ఐ రెడ్డి నాయక్ పార్థివ దేహానికి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు శుక్రవారం ఘన నివాళులర్పించారు. తిరుపతి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న రెడ్డినాయక్ రోజువారీ విధులు నిమిత్తం స్టేషన్‌కు వచ్చాడు. ఈ సందర్భంగా ఆయన బాత్రూంలో కాలు జారి పడడంతో సిబ్బంది హుటాహుటిన రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న ఎస్పీ సుబ్బరాయుడు రుయా ఆస్పత్రికి వెళ్లి మృత దేహానికి పూల మాల వేసి, నివాళులర్పించి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఆయన సతీమణికి ధైర్యం చెప్పారు. రెడ్డి నాయక్ స్వస్థలం అన్నమయ్య జిల్లా, కేవీ పల్లి మండలం, జిల్లేళ్లమంద పెద్ద తాండా గ్రామం. అక్కడే ఆయనకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

భూ ఆక్రమణపై అటవీ అధికారుల ఆగ్రహం



ఆక్రమిత భూములను పరిశీలిస్తున్న అటవీ అధికారులు, రెవెన్యూ సిబ్బంది

చిట్టమూరు(చిల్లకూరు): ఆరూరు సమీపంలో ఉన్న అటవీ భూములను కొంత మంది టీడీపీ నాయకులు ఆక్రమించుకోవడాన్ని సాక్షి దినపత్రికలో రావడంతో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆరూరు సమీపంలో ఆక్రమణలకు గురైన భూములను అటవీ అధికారులు పరిశీలించారు. ఈ భూ ఆక్రమణలను ముందుగా రెవెన్యూ అధికారులు సందర్శించి, అటవీ భూములుగా తేల్చారు. అయితే అటవీ అధికారులు కూడా గురువారం భూములను సందర్శించారు. సూళ్లూరుపేట రేంజర్ నరసింహం, రెవెన్యూ అధికారులతో కలసి మాట్లాడుతూ భూములను చదును చేసిన వారి వివరాల జాబితా సిద్ధం చేసి ఇవ్వాలని వీఆర్‌ఓకు సూచించారు. ఆక్రమిత భూమిలో పని చేసిన యంత్రాలను కూడా గుర్తించి అందిస్తే సంబంధిత వాహన యజమానులపైనా, ఆక్రమణలకు పూనుకున్న వారిపై కేసులు నమోదు చేస్తామని అన్నారు. విదేశాలకు చెందిన ఎన్నో రకాల వలస పక్షులు తిరిగే ఈ ప్రాంతాలను ఆక్రమించుకోవడం దారుణమని అన్నారు. ఆయన వెంట సర్వేయర్ లక్ష్మీనారాయణ, వీఆర్‌ఓ శ్రీనివాసులు, అటవీ సిబ్బంది ఉన్నారు.

ఎయిర్‌పోర్ట్ పెండింగ్ పనులు వేగవంతం



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని పెండింగ్ ఎలక్ట్రిక్ పవర్ లైన్ షిఫ్టింగ్ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్, ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడు ఎలక్ట్రిక్ పవర్ లైన్ టవర్‌లను ఈ నెల 15కి వందశాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ నెల 8కి 4 టవర్లు, 15కి మిగిలిన 3 టవర్లు పూర్తి చేయాలని వివరించారు. అలాగే మీడియన్ లైట్ల ఏర్పాటు త్వరితగతిన చేయాలని సూచించారు. లైటింగ్ బ్లాక్ స్పాట్స్ లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అలాగే రహదారులు భవనాల శాఖ వారు ఎయిర్ పోర్టు సమీప కూడలిలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో శ్రీకాళహస్తి ఆర్డీఓ రవిశంకర్ రెడ్డి, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర నాయుడు, ఆర్అండ్‌బి ఎస్ఈ మధుసూదన్ రావు, ఏపీ ట్రాన్స్‌కో అధికారులు పాల్గొన్నారు

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 18 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 61,465 మంది స్వామివారిని దర్శించుకోగా 21,206 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

▸▸ గంగాధర నెల్లూరు మండలం పీజీ అగ్రహారానికి చెందిన ఆర్ముగ రెడ్డి (60) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మండలం కేంద్రంలోని ఓ మెడికల్ షాపు వద్దకు వచ్చారు. మెడికల్ షాపులోనే అనధికారికంగా నిర్వహిస్తున్న క్లినిక్‌కు వెళ్లారు. ఆ క్లినిక్ నిర్వాహకులు ఆయనకు వచ్చిన వ్యాధి ఏంటో కూడా గుర్తించలేదు. వెంటనే ఇంజక్షన్ ఇచ్చి సెలైన్ బాటిల్ పెట్టేశారు. ఈ క్రమంలో ఆ వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పీహెచ్‌సీ వైద్యులు క్లినిక్‌కు తాళం వేశారు.

▸▸ శ్రీరంగరాజపురం మండలం సీకేపురం గ్రామానికి చెందిన ప్రేమ్‌కుమార్, లోకేశ్వరి దంపతుల కుమార్తె ప్రీతి (5)కి గతేడాది జూలై 8న జ్వరం చేసింది. మండల సరిహద్దులోని ఆర్ఎంపీ డాక్టర్ వద్దకు తీసుకెళ్లారు. ఆయన క్షుణ్ణంగా పరీక్షించి ఇంజక్షన్ ఇచ్చాడు. కాసేపటికే బిడ్డ శరీరం రంగు మారింది. వెంటనే చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన ప్రభుత్వ వైద్యులు ఇంజక్షన్ డోస్ అధికంగా ఇవ్వడంతో గుండెలో రక్తం గడ్డకట్టిందని గుర్తించారు. వెంటనే తిరుపతికి రెఫర్ చేశారు. తిరుపతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బిడ్డ మృతి చెందింది.

▸▸ తిరుపతి జిల్లా డక్కిలి గురుకుల పాఠశాలలో చదువుతున్న షరీనా(10)కు జూలై 9న తీవ్ర జ్వరమొచ్చింది. బాలికను తల్లిదండ్రులు స్థానికంగా ఉన్న ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. అతడు ఇచ్చిన యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్‌కు బాలికకు రక్తపు వాంతులయ్యాయి. వెంటనే తల్లిదండ్రులు నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి డాక్టర్ల సూచనల మేరకు తమిళనాడులోని చెన్నై ఎగ్మోర్ ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. ఆ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు డీఎంహెచ్ఓ వెల్లడించారు. ఇలాంటి సంఘటనలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వెలుగుచూస్తున్నాయి.

ఉమ్మడి జిల్లా సమాచారం

రిజిస్ట్రేషన్ అయిన ఆస్పత్రుల సంఖ్య	అనుమతులు లేని ఆస్పత్రులు అంచనా
300	215
ల్యాబ్, స్కానింగ్ సెంటర్లు	అనుమతులు లేని ల్యాబ్, స్కానింగ్ సెంటర్లు అంచనా
419	86

రోజువారీ మాత్రలు, మందుల వ్యాపారం రూ.60 లక్షల నుంచి రూ. 70 లక్షల వరకు (సుమారు)

అనధికారిక వ్యాపారం 25 లక్షల వరకు

డమ్మీ డాక్టర్!



చొక్కాపై తెల్లకోటు, మెడలో స్టెత్ వేసుకుని పేద రోగుల గొంతు కోసేస్తున్నారు. నగరాల్లోని పెద్దాస్పత్రికి వెళితే ఖర్చు భరించలేమన్న కారణంతో పల్లెజనం ఈ క్లినిక్స్‌ను ఆశ్రయిస్తుంటారు. ఇదే అదనుగా దమ్మీ డాక్టర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చేస్తున్నారు. చిన్న చిన్న పట్టణాల్లో వీధికో క్లినిక్ బోర్డు తగిలించేస్తున్నారు. అనుమతులు లేకుండా ల్యాబ్‌లు పెట్టేస్తున్నారు. ఇష్టానుసారంగా రక్త, మూత్ర పరీక్షలు చేస్తున్నారు. మరి కొందరైతే మెడికల్ దుకాణాల్లోనే ఏకంగా సర్జరీలు చేసేస్తున్నారు. కేవలం కాసుల కోసం గ్రామీణుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వీరిపై ఫిర్యాదులు వెల్లువలా వచ్చినప్పటికీ అధికారులు మాత్రం మామూళ్ల మత్తులో జోగుతున్నారు.

- మెడికల్ షాపులే ఆపరేషన్ థియేటర్లు
- ఆర్ఎంపీలే స్పెషల్ సర్జన్లు
- పేద రోగుల ప్రాణాలతో చెలగాటం
- మామూళ్ల మత్తులో అధికార యంత్రాంగం

సాక్షి ప్రతినిధి, తిరుపతి/కాణిపాకం: విద్యార్హతలు లేకపోతేనేం..జంకూ గొంకూ లేకుండా తెల్లకోటు తొడుక్కుంటున్నారు. అన్నిరకాల రోగాలకూ చికిత్స చేసేస్తున్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 5 వేల మందికి పైగా ఆర్ఎంపీ, పీఎంపీలు కొనసాగుతున్నారు. రెండు జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లోనే అధికంగా నకిలీ డాక్టర్లు చలామణి అవుతున్నారు. గుడిపాల, యాదమరి, జీడీ నెల్లూరు, కార్వేటినగరం, ఎస్ఆర్ పురం, వి.కోట, కుప్పం, నగరి, బంగారుపాళెం, పలమనేరు, సత్యవేడు, పుత్తూరు, శ్రీకాళహస్తి, నాయుడుపేట తదితర ప్రాంతాల్లో కుప్పలు తెప్పలుగా క్లినిక్‌లు వెలుస్తున్నాయి. ఇందులో చాలా మంది రిజిస్ట్రేషన్ చేసుకోక పోగా మరి కొంత మంది ఎలాంటి అనుమతులు లేకుండా వైద్యం చేస్తున్నారు. నకిలీ సర్టిఫికెట్లతో డాక్టర్లుగా చలామణి అవుతున్నారు. బీ-ఫార్మసీ సర్టిఫికెట్‌తోనే క్లినిక్‌లు తెరుస్తున్నారు. డాక్టర్ల వద్ద కొన్నాళ్లు కాంపౌండర్లుగా, సహాయకులుగా పనిచేసిన అనుభవంతో సొంత ప్రాంతాల్లో ఆర్ఎంపీలుగా అవతారమెత్తుతున్నారు. వీరు రోగులను పరీక్షించి సూదిమందు ఇవ్వడంతోపాటు వివిధ రకాల మాత్రలు, మందులు రాస్తున్నారు. కొంత మంది ఏకంగా రక్త, మూత్ర పరీక్షల ల్యాబ్‌ను సైతం నిర్వహిస్తూ, గ్లూకోజ్ బాటిళ్లు సైతం పెడుతున్నారు.

ఏజెన్సీలకు నిబంధనలేవీ?

ఉమ్మడి జిల్లాలో 1800 మెడికల్ దుకాణాలుంటే, వివిధ ఔషధ కంపెనీలకు 725 ఏజెన్సీలు ఉన్నాయి. ఔషధ నియంత్రణ శాఖ నిబంధనల ప్రకారం వైద్యుల సిఫారసులు లేకుండా మందులు విక్రయించడానికి అనుమతుల్లేవు. కానీ కాసులకు కక్కుర్తి పడిన ఆయా దుకాణాలు, ఏజెన్సీల నిర్వాహకులు పల్లెల్లో ఆస్పత్రులు ఏర్పాటు చేసుకున్న ఆర్ఎంపీలకు ఇష్టారాజ్యంగా మందులను సరఫరా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇందులో అధికారికంగా రోజుకు మందులు, మాత్రల వ్యాపారం సుమారు రూ.60 నుంచి రూ.70 లక్షల వరకు వ్యాపారం జరిగితే..అనధికారికంగా రూ.30 లక్షల వరకు వ్యాపారం జరుగుతున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు.

ధనార్జనే ధ్యేయం

కొందరు ఆర్ఎంపీలు ధనార్జనే ధ్యేయంగా ఇష్టానుసారంగా వైద్యం చేస్తున్నారు. ప్రథమ చికిత్స అందించాల్సిన వీరు ఏకంగా ప్రత్యేక భవనాల్లో పడకలు ఏర్పాటు చేసి పదుల సంఖ్యలో రోగులకు వైద్యం అందిస్తున్నారు. భారీ ఫ్లెక్సీలు, పెద్ద పెద్ద హోర్డింగులు ఏర్పాటు చేసుకుని ప్రచారం సాగిస్తున్నారు. కొన్ని చోట్ల క్లినిక్, మందుల దుకాణం, ల్యాబ్‌లు అన్నీ ఒకే గదిలో నిర్వహిస్తుండడం గమనార్హం. పరిమితులు దాటి చేస్తున్న వైద్యం రోగుల ప్రాణం మీదకు వస్తోంది. తక్కువ డబ్బుతో వైద్యం అందుతుందన్న కారణంతో పేద రోగులు క్యూ కడుతున్నారు. ఇదే అదనుగా కాసులే లక్ష్యంగా చేసుకుని వైద్యులు ఇష్టానుసారంగా వైద్యం అందిస్తున్నారు.

ఆర్ఎంపీలకు నిబంధనలు

నిబంధనల ప్రకారం ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి. ఎలాంటి ఇంజక్షన్‌లు ఇవ్వకూడదు. ఎవరైనా జ్వరంతో బాధపడుతూ వస్తే సాధారణ మాత్రలే ఇవ్వాలి. తీవ్రత ఎక్కువగా ఉంటే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సిఫారసు చేయాలి. కొందరు ఆర్ఎంపీలు తమ పరిధి దాటి చికిత్సలు చేస్తున్నారు. ప్రతి సమస్యకు ఇంజక్షన్ ఇచ్చేస్తున్నారు. ఎక్కువ మోతాదులో యాంటీ బయోటిక్స్, స్టెరాయిడ్స్ వంటివి సూచిస్తున్నారు. వీటివల్ల రోగ నిరోధక శక్తిపై ప్రభావం చూపుతోంది. గర్భిణులు, చిన్న పిల్లలకు ఎలాంటి చికిత్స చేయకూడదు. ఫార్మసీ సర్టిఫికెట్లు దగ్గర ఉంచుకుని మందుల దుకాణాలు నిర్వహించడం కూడా నిబంధనలకు విరుద్ధమే. ఇలాంటి డమ్మీ డాక్టర్లపై ఫిర్యాదుల పరంపర కొనసాగుతోంది. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికారులు దాడులు చేసి అనుమతుల్లేని 48 క్లినిక్‌లు, ఆస్పత్రులను గుర్తించారు.

కిల్లింగ్ ఇంజక్షన్‌లు



కొందరు ఆర్ఎంపీలు, దమ్మీ డాక్టర్లు వేసే ఇంజక్షన్లు వికటించి రోగులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఏ వయసు వారికి ఏ మందు ఎంత డోస్ ఇవ్వాలో ఈ నకిలీ వైద్యులకు తెలియక పోవడమే ప్రధాన కారణం. మరోవైపు త్వరగా వ్యాధి తగ్గిపోవాలన్న కారణంతో ఇష్టమొచ్చిన డోసు ఇచ్చేస్తున్నారు. ఫలితంగా ఇంజక్షన్ ఇచ్చిన అనంతరం తీవ్ర అస్వస్థతకు గురై గంటల వ్యవధిలోనే ప్రాణాలు కోల్పోతున్నారు. ఇలా ఇంజక్షన్లు వికటించడం వల్ల వాంతులు చేసుకోవడం, చలిపెరగడం, శరీరమంతా దద్దుర్లు రావడం వంటి లక్షణాలు అధికంగా కనిపిస్తున్నాయి. పరిస్థితి అదుపులోకి రాకపోగా రోగులు నేరుగా కోమాలోకి వెళ్తున్నారు. దీనిపై వైద్యాధికారులకు ఫిర్యాదులు వెల్లువలా వస్తున్నాయి.

హద్దు దాటకూడదు



ఆర్ఎంపీలు, పీఎంపీలు కచ్చితంగా వైద్య, ఆరోగ్య సూత్రాలు పాటించాలి. వారి ఇష్టానుసారంగా వైద్యం చేయరాదు. హద్దు దాటి ప్రవర్తించకూడదు. ప్రథమ చికిత్స వరకు మాత్రమే పరిమితం చేసుకోవాలి. ఇంజక్షన్‌లు, సెలైన్ పెట్టించడం, ఆపరేషన్ చేయడం, ప్రసవాలు చేయడం చేస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయి. ప్రజలు కూడా అవగాహన కలిగి ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవాలి.

-శ్రీహరి, డీఎంఅండ్‌హెచ్‌ఓ, తిరుపతి

ప్రభుత్వ వైద్యాన్ని వినియోగించుకోండి



గత కొన్నిరోజులుగా ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లపై దాడులు నిర్వహిస్తున్నాం. ఈ దాడుల్లో రిజిస్ట్రేషన్లు లేనివి, ఎలాంటి అర్హత లేకుండా వైద్య చికిత్స చేస్తున్న వాళ్లను గుర్తించాం. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. రోగులు ఎలాంటి సమస్యలున్నా ఇక్కడ చికిత్స చేసుకోవచ్చు. ఆర్ఎంపీలపై ఫిర్యాదులు వచ్చినప్పుడల్లా తనిఖీలు చేస్తున్నాం.

- ప్రభావతి దేవి, డీఎంఅండ్‌హెచ్‌ఓ, చిత్తూరు



తిరుపతిలో తనిఖీలు నిర్వహిస్తున్న డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ శ్రీహరి



జీడీనెల్లూరులో క్లినిక్‌ల తనిఖీలో చిత్తూరు డీఎంఅండ్‌హెచ్ఓ(ఫైల్)

తహసీల్దార్ల పోస్టింగులపై తర్జనభర్జన

తహసీల్దార్లకు వివిధ మండలాల్లో పోస్టింగులు ఇవ్వడంపై జిల్లా అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ప్రధానంగా పది మండలాల్లో పోస్టింగ్‌లకు భలే డిమాండ్ నెలకొంది. దీంతో తీవ్రమైన కసరత్తు చేస్తున్నట్లు చర్చ సాగుతోంది. మరోవైపు ఎమ్మెల్యేల సిఫారసు లేఖల మేరకు మండలాలను కేటాయిస్తున్నట్లు జోరుగా ప్రచారం సాగుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపుగా తహసీల్దార్ల పోస్టింగ్ ప్రక్రియ అన్ని జిల్లాల్లోనూ పూర్తి అయినట్లే. అయితే తిరుపతి జిల్లాలో మాత్రం కసరత్తు ఇంకా కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో మండల రెవెన్యూ పగ్గాలు డెప్యూటీ తహసీల్దార్ల చేతుల్లోనే నడుస్తున్నాయి. ఇప్పటికే గత నెల 27వ తేదీ నుంచి తహసీల్దార్ల బాధ్యతను డీటీలే నిర్వర్తిస్తున్నారు.

- ఆ పది చోట్ల భలే డిమాండ్
- ఎమ్మెల్యేల సిఫారసు లేఖల మేరకు మండలాల కేటాయింపులు
- రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పోస్టింగుల కేటాయింపు పూర్తి
- తిరుపతి జిల్లాలో కొనసాగుతున్న లాబీయింగ్
- గత నెల 27 నుంచి డీటీల చేతుల్లోనే రెవెన్యూ పగ్గాలు

తిరుపతి అర్బన్ వారం రోజుల క్రితం తిరుపతి జిల్లాకు 42 మంది పాత తహసీల్దార్లు(ఎన్నికల ముందు ఈ జిల్లాలో పనిచేసిన వారు) విచ్చేశారు. గత నెల 27వ తేదీ నుంచి జాయినింగ్ రిపోర్ట్‌ను కలెక్టరేట్ కార్యాలయంలో అందజేశారు. ఈ క్రమంలో తహసీల్దార్లకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్థానిక మండలం, స్థానిక నియోజకవర్గం, స్థానిక రెవెన్యూ డివిజన్ పరిధిలో కాకుండా ఇతర ప్రాంతాల్లో మాత్రమే పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది. సార్వత్రిక ఎన్నికల ముందు జిల్లాలోని 34 మండలాలకు చెందిన తహసీల్దార్లుతోపాటు కలెక్టరేట్‌లో పనిచేస్తున్న 8 మంది తహసీల్దార్లుతో కలపి మొత్తం 42 మంది రాయలసీమ జిల్లాతోపాటు నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆ 42 మంది తహసీల్దార్లను జూలై 27వ తేదీన ఆయా జిల్లాల నుంచి రిలీవ్ చేశారు. ఈ క్రమంలో ఒకటి రెండు రోజుల్లో వారికి పోస్టింగ్స్ ఇవ్వాల్సి ఉంది. అయితే వారం రోజులు గడుస్తున్నా జిల్లా అధికారులు పోస్టింగ్‌లు ఇవ్వకుండా కసరత్తు చేస్తున్నామంటూ కాలయాపన చేస్తున్నారు.

పది మండలాలకు భలే డిమాండ్

జిల్లాలో 34 మండలాలు ఉన్నప్పటికీ పది మండలాల్లో తహసీల్దార్ పోస్టింగ్‌లకు భలే డిమాండ్ నెలకొంది. ప్రధానంగా తిరుపతి రూరల్, తిరుపతి అర్బన్, చంద్రగిరి, రేణిగుంట, శ్రీకాళహస్తి, తొట్టంబేడు, వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట, సత్యవేడు మండలాల్లో తహసీల్దార్‌గా పనిచేయడానికి రాజకీయ అండదండలున్నవారు పెద్ద ఎత్తున లాబీయింగ్ చేస్తున్నట్లు జిల్లాలో జోరుగా చర్చ సాగుతోంది. ఆ మేరకు స్థానిక ఎమ్మెల్యేలతో మైత్రి కొనసాగిస్తున్నట్లు అంతా మాట్లాడుతున్నారు. బలంగా ఉన్న తహసీల్దార్లు సంపాదన ఉండే చోట పోస్టింగ్‌ను దక్కించుకునేలా ఉన్నారని అంతా అంటున్నారు. మరి తుది జాబితాను తయారు చేయడానికి జిల్లా రెవెన్యూ పెద్దలకు ఇంకా ఎన్ని రోజుల సమయం పడుతుందో వేచి చూడాల్సిందే.

ఆ నలుగురి వైపే అందరి చూపు

జిల్లాలో నలుగురు తహసీల్దార్లు చెప్పిన పని వెంటనే చేస్తారని వారు తమ మండలంలోనే ఉంచాలంటూ కొందరు అధికార పార్టీకి చెందిన నియోజకవర్గం నేతలు సిఫారసు లేఖల్లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. అయితే ఆ నలుగురు తహసీల్దార్లను ఇద్దరు ముగ్గురు నియోజకవర్గం స్థాయి అధికారులు కోరుకోవడంతో వారిని ఎవరికి కేటాయించాలనే అంశం అధికారులకు తలపోటుగా మారినట్లు తెలుస్తోంది. దీంతోనే తీవ్రమైన జాప్యం జరుగుతోందని చెబుతున్నారు. పోస్టింగ్ ప్రక్రియ ఓ కొలిక్కి రావడానికి మరింత సమయం పడుతుందని సమాచారం.

జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ ల్యాబ్‌లపై దాడులు



తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి

తిరుపతి తుడా: జిల్లా వ్యాప్తంగా కోకొల్లలుగా పుట్టుకొచ్చిన ప్రైవేట్ మెడికల్ ల్యాబోరేటరీలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శుక్రవారం దాడులు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ప్రైవేట్ ల్యాబ్‌లపై దాడులు నిర్వహించి వాటి సామర్థ్యాన్ని తనిఖీ చేయాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ మెడికల్ ల్యాబ్‌లను తనిఖీలు చేశారు. వీటిలో అనుమతులు, సరైన రికార్డులు లేకపోవడంతో మొత్తం 19 ల్యాబ్‌లను సీజ్ చేశారు.

టీటీడీలో పలువురు అధికారుల బదిలీ

తిరుమల: టీటీడీలో పలువురు అధికారులను బదిలీచేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో టీటీడీ రిసెప్షన్ విభాగం డిప్యూటీ ఈవో ఆర్-1గా భాస్కర్, డిప్యూటీ ఈవో ఆర్-2గా హరీంద్రనాథ్‌ను నియమించారు. కల్యాణకట్ట డిప్యూటీ ఈవోగా వెంకటయ్యను నియమించగా ఆ స్థానంలో పనిచేస్తున్న డిప్యూటీ ఈవో సెల్వంను తిరుపతికి బదిలీ చేశారు.

ఆరోగ్యానికి బడ్జెట్ నిధులు పెంచండి

- స్విమ్స్‌ని జాతీయ ప్రాముఖ్యత కలిగిన వైద్య సంస్థగా గుర్తించాలి
- శ్రీబాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీకి జాతీయ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ హోదా కల్పించాలి
- ప్రజారోగ్యం కోసం బడ్జెట్‌లో కేటాయించిన నిధులు సరిపోవని వెల్లడి
- పార్లమెంట్‌లో డిమాండ్ చేసిన తిరుపతి ఎంపీ గురుమూర్తి



పార్లమెంట్‌లో హెల్త్ బడ్జెట్‌పై మాట్లాడుతున్న తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి

తిరుపతి మంగళం: హెల్త్ బడ్జెట్‌లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి నిధులు పెంచాలని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం పార్లమెంట్‌లో హెల్త్ బడ్జెట్‌పై ఆయన వివిధ అంశాలపై విస్తృతంగా మాట్లాడారు. తిరుపతి స్విమ్స్ విశ్వవిద్యాలయానికి జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థ హోదాను కల్పించాలని ఆయన కోరారు. ప్రధాన మంత్రి స్వస్థ సురక్ష యోజన పథకానికి నిధుల కేటాయింపులు తగ్గించడం ఆందోళన కలిగిస్తోందని ఎంపీ గురుమూర్తి అన్నారు. నేషనల్ టెలీ మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్ కోసం ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయింపులు చాలా తక్కువగా ఉన్నాయని, కేవలం రూ.90 కోట్లు కేటాయించడం బాధాకరమని పేర్కొన్నారు. వైద్య, ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమం కోసం కేటాయించిన మూలధన వ్యయం సరిపోదని తిరుపతి ఎంపీ గురుమూర్తి తెలిపారు. ఈ రంగానికి కేవలం రూ.3510.49 కోట్లు కేటాయించడం ఆందోళనకరం అని ఆయన అన్నారు. తిరుపతి స్విమ్స్ సహకారంతో తిరుపతి పార్లమెంట్ పరిధిలో రెండు మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్‌లను ప్రారంభించామన్నారు. శ్రీబాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీకి జాతీయ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ హోదా కల్పించాలని ఆయన కోరారు. తిరుపతిలో ఇన్నోవేటివ్ మెడికల్ హబ్ ఏర్పాటు చేయాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని గత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆంధ్రాలోని ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీని నెలకొల్పాలని సంకల్పించిందన్నారు.



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.72,570
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.6,517

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.85,900
రిటైల్ వెండి గ్రాము	రూ.87.90

క్లుప్తంగా

ఇసుక అక్రమ రవాణాకు అడ్డు



ఎగువరెడ్డివారిపల్లి శ్మశాన వాటిక వద్ద ట్రెంచ్

చంద్రగిరి: స్వర్ణముఖి నదీ పరివాహక ప్రాంతాల్లో అక్రమ ఇసుక రవాణాను గ్రామస్తులు కట్టడి చేసిన ఘటన శుక్రవారం మండల పరిధిలోని రెడ్డివారిపల్లి పంచాయతీలో చోటు చేసుకుంది. గత కొద్ది రోజులుగా ఎగువరెడ్డివారిపల్లి శ్మశాన వాటిక నుంచి కొంత మంది అక్రమంగా ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో గ్రామస్తులంతా కలసి అక్రమ ఇసుక రవాణాను కట్టడి చేయాలని నిర్ణయించారు. దీంతో శ్మశాన వాటిక చుట్టూ జేసీబీ సాయంతో ఇసుక తరలించకుండా ట్రెంచ్ ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ శ్మశానంలో సైతం అక్రమార్కులు ఇసుకను తవ్వేస్తున్నారని, దీంతో పూర్వీకుల సమాధులు ధ్వంసమవుతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయడానికి ఇలా ట్రెంచ్ ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



మృతి చెందిన దయమ్మ

తడ: జాతీయ రహదారిపై చేనిగుంట గ్రామం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన కొల్లపట్టు దయమ్మ(63) మృతి చెందింది. ఎస్‌ఐ పి.నరసింహారావు తెలిపిన వివరాల మేరకు అవతల ఉన్న కొట్టులో టిఫిన్ తెచ్చుకునేందుకు బయల్దేరిన దయమ్మ నడుచుకుంటూ వెళుతున్న సమయంలో తమిళనాడు నుంచి సూళ్లూరుపేటకు వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఆమెను స్థానికుల సాయంతో అదే కారులో హుటాహుటిన సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆమె అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. దీనిపై మృతురాలి భర్త సుబ్రమణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిడ్ డే మీల్స్ మిథ్యేనా!

'టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజన పథకం అమలు చేసి తీరుతాం... ఇంటర్ విద్యలో హాజరు శాతం పెంచేందుకు 2024–25 విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే పథకాన్ని ప్రారంభిస్తాం... విద్యార్థులు క్యారీ బ్యాగులు మోసుకుని రావాల్సిన పనిలేదు. కాలేజీలల్లో నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యంగా మెనూ తయారు చేస్తాం' ఇదీ నారా లోకేష్ యువగళం పాదయాత్రలో యువతకు ఇచ్చిన ప్రధాన హామీ.

జూనియర్ కళాశాలలు ప్రారంభమై దాదాపు మూడు నెలలు కావస్తున్నా పథకం అమలు మాటే ఎత్తడం లేదు. యువగళం వెలవెలబోతున్న సందర్భంలో యువతను ఆకట్టుకునేందుకు అమలుకు నోచుకోని హామీలను గుప్పించారు. అనుకూలమైన కళాశాలల్లో విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి యువత తమవైపే ఉన్నారని చూపించారు. ఈ పాదయాత్రలో పలు మార్లు మిడ్ డే మీల్స్‌పై హామీలు ఇచ్చారు. ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని ఇప్పటికే విద్యార్థి సంఘాల నాయకులు కలెక్టర్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. తక్షణం పథకాన్ని అమలు చేయని పక్షంలో కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చి, ధర్నాలు, నిరసనలు చేపడుతామని తిరుపతి జిల్లా విద్యార్థి సంఘాల ఐక్యవేదిక నాయకులు హెచ్చరిస్తున్నారు.

– తిరుపతి సిటీ

- కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ఊసేది?
- కాలేజీలు ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా అమలుకు నోచుకోని వైనం
- యువగళం.. ప్రగల్భాలేనా..
- అమలు చేయకపోతే నిలదీస్తామంటున్న విద్యార్థి సంఘాలు



జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేయాలని కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

తిరుపతి జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలు	–	20
టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న జూనియర్ కళాశాలలు	–	4
ఫస్టియర్‌లో చేరిన విద్యార్థులు	–	31,655
రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు	–	28,790
మొత్తం విద్యార్థుల సంఖ్య	–	60,445

కళాశాలల బంద్‌కు పిలుపునిస్తాం



యువగళం పాదయాత్రలో లోకేష్ జూనియర్ కళాశాలలో మిడ్ డే మీల్స్ పథకాన్ని తిరిగి అమలు చేస్తామని విద్యార్థులకు మాట ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ఏడాది నుంచి నాణ్యమైన ఆహారాన్ని అందిస్తామన్నారు. కళాశాలలు ప్రారంభమై సుమారు 3 నెలలు పూర్తవుతోంది. కానీ మధ్యాహ్న భోజన పథకంపై నోరు మెదపడం లేదు. విద్యార్థులు ఆకలి కేకలతో అలమటిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి కళాశాలకు వచ్చే పేద విద్యార్థుల పరిస్థితి వర్ణనాతీతం. కొందరు క్యారీలు తెచ్చుకునే స్థోమత లేని విద్యార్థులు ఆకలి చదువులు చదువుతున్నారు. పస్తులు ఉంటూ కళాశాలలకు రాలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా విద్యాశాఖా మంత్రి నారాలోకేష్ ఇచ్చిన మాటను వెంటనే నిలబెట్టుకోవాలి. లేని పక్షంలో ధర్నాలు, నిరసనలు పెద్ద ఎత్తున చేస్తాం.

–ప్రవీణ్ కుమార్, ఏఐఎస్‌ఎఫ్, జిల్లా కార్యదర్శి, తిరుపతి

యువగళం మూగబోయిందా?



నారాలోకేష్ యువగళం ప్రగల్భాలు ఏమయ్యాయి. అధికారం చేపట్టగానే యువగళం మూగబోయిందా... మధ్యాహ్న భోజన పథకాన్ని జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు అందిస్తాం అని పాదయాత్రలో హామీ ఇచ్చారు. కళాశాలలకు పూర్వ వైభవం తెస్తామంటూ యువతను మభ్యపెట్టారు. కళాశాలలు ప్రారంభమై 90 రోజులు కావస్తోంది. పథకం అమలుపై దిశానిర్దేశం చేయలేదు. కనీసం ఎప్పటి నుంచి అమలు చేస్తారనే మాట సైతం మాట్లడకపోవడం దారుణం. తక్షణం పథకాన్ని ప్రతి ప్రభుత్వ కళాశాలలో అమలు చేసి తీరాల్సిందే. ఆలస్యం చేస్తే ఐక్య విద్యార్థి సంఘాలతో కలిసి పోరాడుతాం.

– రవి, ఎస్‌ఎఫ్‌ఐ, జిల్లా కార్యదర్శి, తిరుపతి

తక్షణం అమలు చేయాలి



మిడ్ డే మీల్స్ పథకం తక్షణం అమలు చేసి తీరాల్సిందే. జిల్లాలో ఇంటర్ చదువుతున్న సుమారు 60వేల మంది విద్యార్థులు పథకం అమలు కోసం ఎదురుచూస్తున్నారు. భోజనం క్యారీలు తీసుకురాకండి... ప్రభుత్వమే ప్రతి ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తామంటూ మంత్రి లోకేష్ చెప్పిన మాట నిలబెట్టుకోవాలి. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణంలోని కళాశాలలకు వచ్చే విద్యార్థులకు భోజన వసతి కల్పించాలి. ఇప్పటికే కాలేజీలు ప్రారంభమయ్యాయి. ఇంతవరకు ప్రభుత్వం పథకాన్ని అమలు చేయకపోవడం దారుణం.

– ఆర్.ఆశా, పీడీఎస్‌ఓ, జిల్లా కార్యదర్శి, తిరుపతి

నిరుపేద విద్యార్థులకూ శఠగోపం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు గడుస్తోంది. సూపర్‌సిక్స్ అంటూ నిరుద్యోగులను, యువతను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చింది. చెప్పిన ఒక్క హామీని కూడా ఇంతవరకు ప్రారంభించకపోవడం దారుణం. ప్రభుత్వ ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తామని నిరుపేద విద్యార్థులకు శఠగోపం పెట్టారు. కళాశాలలు ప్రారంభమైనా మాట వరుసకైనా విద్యాశాఖ మంత్రి నోరుమెదపక పోవడం దారుణం. వేలాది మంది విద్యార్థులు పట్టెడన్నం కోసం ఎదురు చూస్తున్నారు. మానవత్వంతోనైనా పథకాన్ని అమలు చేసి తీరాలి. లేకుం విద్యార్థులతో కలసి ధర్నాలు, నిరసనలు తప్పవు.

– జె.మల్లికార్జున, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తిరుపతి

విద్యార్థుల ఆగ్రహానికి గురికావద్దు



యువగళం పాదయాత్రలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మిడ్‌డే మీల్స్ అందిస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చిన లోకేష్ బాబు మాట తప్పారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక బడ్జెట్ లేదని, ఆర్థికంగా రాష్ట్రం ఇబ్బందులు ఎదుర్కొంటోందంటూ మాయ మాటలు చెబుతున్నారు. హామీలు గుప్పించే సమయంలో బడ్జెట్ విషయం గుర్తుకు రాలేదా? పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటం మంచి పద్ధతి కాదు. తక్షణం పథకాన్ని అమలు చేసి తీరాలి. లేకుంటే అన్ని విద్యార్థి సంఘాలు కలసి ఉద్యమిస్తాం. ప్రభుత్వం విద్యార్థుల ఆగ్రహానికి గురికాక ముందే పథకం అమలు చేయాలి.

– కె.ఆది, పీడీఎస్‌యూ, జిల్లా కార్యదర్శి, తిరుపతి

బ్యాంకులో దొంగతనానికి యత్నం

- వెస్ట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు



బ్యాంకులో పరిశీలిస్తున్న ఏఎస్పీ కులశేఖర్

తిరుపతి క్రైమ్: బాలాజీ కాలనీలో ఉన్న యూనియన్ బ్యాంకులో దొంగతనానికి ప్రయత్నించిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. తిరుపతి జిల్లా లా అండ్ ఆర్డర్ ఏఎస్పీ కులశేఖర్ ఘటన స్థలానికి చేరుకొని పూర్తిస్థాయిలో పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. బాలాజీ కాలనీలోని యూనియన్ బ్యాంకులో గుర్తు తెలియని వ్యక్తి 12 గంటల 50 నిమిషాల సమయంలో చోరీ చేసేందుకు వచ్చాడన్నారు. దుండగుడు సీసీ కెమెరాలు కనిపించకుండా బెడ్ షీట్ కప్పుకుని బ్యాంకులోని ఆఫీస్ రూములోని కిటికీ గ్రిల్‌ను పెద్ద కట్టర్‌తో కట్ చేసి లోపలికి ప్రవేశించాడని తెలిపారు. రెండు గంటలపాటు స్ట్రాంగ్ రూమ్ తాళాల కోసం వెతికి ఎంతకూ దొరక్కపోవడంతో వచ్చిన దారి నుంచే పారిపోయాడన్నారు. ఇదంతా కూడా సీసీ కెమెరాలో రికార్డ్ అయినట్టుగా తెలిపారు. గుర్తుపట్టలేనంతగా ముసుగు వేసుకొని లోపలికి ప్రవేశించాడని తెలిపారు.

దుండగుడు ముందుగా రెక్కీ నిర్వహించే దొంగతనానికి పాల్పడి ఉండొచ్చని భావిస్తున్నామన్నారు. దుండగుడు కిటికీ గ్రిల్ తొలగించి వెళ్లే సమయంలో కాటన్ వేసి వెళ్లడంతో గమనించలేకపోయారు. క్లీనింగ్ చేసే సమయంలో పనివారు గుర్తించి మేనేజర్‌కు చెప్పడంతో విషయం బయటపడిందన్నారు. దీనిపై బ్యాంకు చీఫ్ మేనేజర్ సబరేశ్ దేవ్ జరిగిన విషయాన్ని వారి హెడ్ ఆఫీస్‌కి సమాచారం అందించారు. సాయంత్రం సమయంలో ఘటనపై వెస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని దుండగుడి వేలిముద్రలు సేకరించారు. త్వరలోనే నిందితుడిని అరెస్ట్ చేస్తామని ఏఎస్పీ తెలిపారు.

వేడుకగా జెండా పండుగ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఈ నెల 15వ తేదీన వేడుకగా నిర్వహిద్దామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం జెండా ఉత్సవం సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై జేసీ శుభం బన్సల్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ నారుపురెడ్డి మౌర్య, డీఆర్‌ఓ పెంచల కిషోర్, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను తిరుపతి ఆర్డీవో నిషాంత్‌రెడ్డి పర్యవేక్షించాలని తెలిపారు. అలాగే బందోబస్తు, జెండా వందనం, వేదిక అలంకరణను, కవాతు ఏర్పాట్లను పోలీస్ శాఖ, తుడా వారు సమన్వయంతో చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమానికి వచ్చేవారి కోసం సీటింగ్ ఏర్పాట్లను అర్బన్ తహశీల్దార్, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమ నిర్వహణ డీఈఓ శేఖర్ చూడాలని వెల్లడించారు. ప్రథమ చికిత్స కేంద్రం, అత్యవసర వైద్య సేవల ఏర్పాట్లను డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి చూడాలని, పారిశుధ్యం, తాగునీటి వసతి ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్‌తోపాటు గ్రామీణ నీటి సరఫరా ఎస్‌ఈ విజయకుమార్ చేపట్టాలని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలపై స్టాల్స్, శకటాలను వివిధ శాఖలు ఏర్పాటు చేయాలని, జిల్లాలోని పలు శాఖలు సాధించిన ప్రగతి నివేదిక తయారీ, పబ్లిక్ అడ్రస్ సిస్టంను సమాచార శాఖ పర్యవేక్షించాలని వివరించారు.

ఈ-పంట నమోదు చేసుకోండి

తిరుపతి రూరల్: ప్రతి రైతు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు పిలుపునిచ్చారు. తిరుపతి రూరల్ మండలం సీగొల్లపల్లిలోని రైతు సేవా కేంద్రం వద్ద జరుగుతున్న ఈ-పంట నమోదు గ్రామసభకు ఆయన హాజరయ్యారు. ఈ-పంట నమోదు ఆవశ్యకత, ఉపయోగాలను రైతులకు వివరించారు. కౌలు రైతు తప్పనిసరిగా కౌలుదారు సర్టిఫికెట్‌ను తీసుకోవాలన్నారు. భూమి యాజమానితోపాటు కౌలు రైతుకు కూడా అన్నదాత సుఖీభవ వర్తిస్తుందన్నారు. ఈ సర్టిఫికెట్‌తో బ్యాంకులో రుణాలు కూడా ఇస్తున్నారని, కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ మనోహర్, మండల వ్యవసాయాధికారి సంగన మమత, హరిత, ప్రేమలత, రైతులు పాల్గొన్నారు.

మండుటెండలో మోకాళ్ల దండన



మోకాళ్లపై కూర్చున్న విద్యార్థులు

రేణిగుంట: రేణిగుంట–తిరుపతి మార్గం ఫ్లైఓవర్ వంతెన సమీపంలో ఉన్న శ్రీవెంకటేశ్వర ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శుక్రవారం విద్యార్థులు హోంవర్క్ రాయలేదన్న కారణంగా పాఠశాల ప్రాంగణంలో ఆరుబయట మోకాళ్లపై కూర్చోబెట్టిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పాఠశాలలోని వివిధ క్లాసులకు చెందిన 40 మంది విద్యార్థులు హోంవర్క్ రాయలేదన్న నెపంతో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు, పీఈటీ కలసి విద్యార్థులను క్లాస్ రూము నుంచి బయటకు తీసుకొచ్చి ఆరుబయట ఎండలో మోకాళ్లపై కూర్చోబెట్టారు. అక్కడే వారితో హోంవర్క్ రాయించి క్రమశిక్షణ పేరుతో పైశాచికం ప్రదర్శించారు. మీడియావారు స్కూల్ వద్దకు వెళ్లి వీడియోలు తీయడంతో వారిని స్కూల్ సిబ్బంది అడ్డుకున్నారు. వాగ్వాదం చోటుచేసుకోవడంతో గాజులమండ్యం పోలీసులు చేరుకుని మీడియా వారికి సర్దిచెప్పి పంపారు. విషయం తెలుసుకున్న డీఈవో శేఖర్ వెంటనే రేణిగుంటలోని స్కూల్ వద్దకు చేరుకుని, విచారించారు. పిల్లలను వేర్వేరుగా పిలిచి మాట్లాడారు. విద్యార్థులను హింసించిన ఇద్దరు ఉపాధ్యాయులను పాఠశాల నుంచి తొలగించారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే మరింత కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

అంగన్‌వాడీ ఆయాపై మందుబాబుల దాడి



అంగన్‌వాడీ ఆయాపై దాడి చేస్తున్న మందుబాబులు

నాయుడుపేట టౌన్: నాయుడుపేట పట్టణంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రం వద్ద శుక్రవారం సాయంత్రం మందు బాబులు వీరంగం సృష్టించారు. అంగన్‌వాడీ కేంద్రం వద్ద మద్యం తాగి వచ్చిన యువకులను ప్రశ్నించినందుకు అంగన్‌వాడీ ఆయాను దూషిస్తూ మూకుమ్మడిగా దాడిచేశారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం జైహింద్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం వద్దకు పట్టణానికి చెందిన మునీంద్ర, శంకర్, హరికృష్ణ మద్యం మత్తులో వచ్చారు. దీంతో వారిని అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా కవిత వారిని నిలదీశారు. మద్యం మత్తులో ఉన్న యువకులు ఆమెను పరుష పదజాలంతో దూషించారు. అంతే కాకుండా ఆమెపై దాడి చేసి గాయపరిచారు. ఈ సంఘటనతో సమీపంలో ఉన్న అంగన్‌వాడీ ఆయా భర్త పోలయ్య, సోదరి వెంకటరమణమ్మ అడ్డునేందుకు వెళ్లారు. వారిపై కూడా దాడి చేసినట్లు బాధితులు పేర్కొన్నారు. గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.